## క్లుప్తంగా

### వాహనాల తనిఖీ



ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

గోపాలపట్నం: గోపాలపట్నం ట్రాఫిక్, లాఅండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నావాహనాలను, తగిన అనుమతులు లేని వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేశారు. గోపాలపట్నం రైల్వే స్టేషన్ నుంచి కొత్తపాలెం వెళ్లే రహదారిలో ఈ తనిఖీలు చేపట్టారు.

### మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



డేగా వద్ద మొక్కలు నాటుతున్న నేవల్ అధికారులు, కీర్తి పట్నాయక్

మల్కాపురం: స్థానిక శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐఎన్ఎస్ డేగా ఆవరణలో బుధవారం సుమారు 310 మొక్కలు నాటారు.ట్రస్టు వ్యవస్థాపకురాలు డాక్టర్ కీర్తి పట్నాయక్, నేవల్ లెఫ్టినెంట్ కమాండర్ డి.అన్షక్, పైలట్ రఘునాథ్‌సింగ్ పాల్గొని డేగా పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు.నేవల్ ఏరియాల్లో ఇంత వరకు ఏ ట్రస్టు ప్రతినిధులు మొక్కలు నాటలేదు.ఇలాంటి కార్యక్రమానికి ముందుకు వచ్చిన కీర్తి పటా న్యక్‌ను నేవల్ అధికారులు అభినందించారు.కార్యక్రమంలో డేగా సిబ్బందితో పాటు ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

### చురుగ్గా పాఠశాల అదనపు భవనం పనులు



భవన నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల అదనపు అంతస్తు భవనం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నాలుగు తరగతి గదులు మాత్రమే ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ సమస్యను వివరించారు. వెంటనే ఆనంద్‌కుమార్ ఉన్నతాధికారులతో మాట్లాడి అదనపు భవనం ఏర్పాటుకు చొరవ చూపారు. ప్రస్తుతం పనులు సాగుతున్నాయి. అదనపు భవనం పూర్తయితే మరో మూడు గదులు అందుబాటులోకి రానున్నాయి.

### ఆకట్టుకున్న జీ20 మాక్ సదస్సు



వివిధ దేశాల ప్రతినిధులుగా విద్యార్థులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యువ మంథన్‌లో భాగంగా మాక్ సదస్సు నిర్వహించారు. జీ 20 సభ్య దేశాల ప్రతినిధులుగా విద్యార్థులు వ్యవహరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలు ఏవిధమైన చర్యలు చేపట్టాలో వారి అభిప్రాయాలను వివరించారు. సెప్టెంబర్‌లో ఢిల్లీలో నిర్వహించనున్న జీ 20 సదస్సు నమూనాగా ప్రదర్శించారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైవీఎస్ వేణుగోపాల్ అభినందించారు. జిల్లా ఎన్‌జీసీ కోఆర్డినేటర్ సూర్రెడ్డి బాబూరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు విజయ తదితరులు పాల్గొన్నారు.



# ఆహ్లాదం.. ఆనందం.. ఆరోగ్యం



చిన్నారుల ఆటల సందడి



వాకింగ్ చేస్తున్న మహిళలు




90వ వార్డులోని అల్లూరి సీతారామరాజు పార్కు

విశాఖ విద్య: ఉరుకులు.. పరుగుల జీవనం గడుపుతున్న నగర వాసులకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు జీవీఎంసీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా జీవీఎంసీ పరిధిలోని పార్కులతో పాటు ఖాళీ స్థలాలను సుందరంగా తీర్చిదిద్దుతోంది. చిన్నా పెద్దా ఆనందంగా గడపడంతో పాటు వ్యాయామానికి అనుగుణంగా.. పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలు .. పెద్దలు సేదతీరడానికి వీలుగా చెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తోంది. జీవీఎంసీ 90 వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీలోని సీతారామరాజు పార్కు అభివృద్ధికి జీవీఎంసీ రూ.12.70 లక్షలు మంజూరు చేసింది. వీటితో పార్కులో అవసరమైన సౌకర్యాలు కల్పించారు. కాలనీ వాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో సేద తీరడానికి ఈ పార్కుకు తరలివస్తున్నారు. ఆట పరికరాలు ఏర్పాటు చేయడంతో పిల్లలు ఉత్సాహంగా గడుపుతున్నారు. పార్కుతో పాటు పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. దీనిపై కాలనీ వాసులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గోడలపై చిత్రాలు

# ప్రతి ఇంట సంక్షేమ పథకాల పంట

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్
- 61వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ప్రజలకు కరపత్రాలు అందించి పథకాల గురించి వివరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: అర్హత ఉన్న ప్రతి ఇంట్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పంట పడుతుందని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. 61వ వార్డు ఇండ్రస్టీయల్ కాలనీ, బాపూజీ కాలనీలో బుధవారం సాయంత్రం కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకం ఆ ఇంటి ముందు నిలుస్తుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో అర్హత ఉన్న వ్యక్తి ప్రభుత్వ పింఛన్ పొందాలంటే అప్పటికే ఉన్న లబ్ధిదారు చనిపోతే గానీ మంజూరయ్యేది కాదని విమర్శించారు. కానీ ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హతే ప్రామాణికంగా పథకాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. నాటి ప్రభుత్వ పాలన తీరును, నేడు వైఎస్ జగన్ సర్కారు పాలనను ఒక్కసారి ప్రజలు గమనించాలన్నారు.

చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు ప్రతి పథకానికి ఒక రేటు నిర్ణయించి మంజూరు చేసేవారని దుయ్యబట్టారు. నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో ఇంత మార్పు వచ్చిందంటే.. అదే మరోసారి అవకాశం ఇస్తే ఇంకెంత మంచి జరుగుతుందో ప్రజలు గమనించాలని ఆడారి కోరారు. ఈ సందర్భంగా సుమారు 400 మందికి జగనన్న బ్రోచర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు(కేబుల్ వాసు), జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం, పార్టీ 90వ వార్డు పార్టీ అధ్యక్షుడు నమ్మి శ్రీను, పార్టీ నాయకులు చట్టి సూకరాజుయాదవ్, బూస అప్పలరెడ్డి, మూగి సూర్యనారాయణ, సోనూ, స్వప్న, విజయ్, దాసరి రవి, స్పందన బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

### రూ.3 లక్షలు లబ్ధి పొందా..



సొంత కుమారుడు మాదిరిగా జగన్‌బాబు అండగా నిలుస్తున్నాడు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం, ఇంటి నిర్మాణానికి సాయం. ఇలా ఇంత వరకు ఈ నాలుగేళ్లలో రూ.3లక్షల వరకు సాయం అందుకున్నాను.

– రమణమ్మ, బాపూజీ కాలనీ

### జగనన్న రుణం తీర్చుకోలేనిది



పలు పథకాల ద్వారా మా కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది. ఆసరా, చేయూత, ప్రతి నెలా పింఛన్ ద్వారా ఇప్పటికి సుమారు రూ.1.5 లక్షలు లబ్ధి పొందాం. ఇలాంటి సాయం ఎవరూ చేయలేరు.

– టి.మోహిని, ఇండస్ట్రియల్ కాలనీ

## సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనం సీఎం జగన్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా: రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలను అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు అల్లూరి సీతారామరాజుకాలనీలో సుమారు రూ. 25 లక్షలు, ఎన్టీఆర్‌కాలనీలో మరో రూ.25 లక్షల ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ లేకుండా అత్యుత్తమ ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే మరెన్నో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న సీబీఐ జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్



ఆశీర్వచనం స్వీకరిస్తున్న వేణుగోపాల్

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం సీబీఐ జేడీ వేణుగోపాల్(హైదరాబాద్)దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో అర్చకులు ఆయన పేరిట పూజలు నిర్వహించారు.

## భెల్ గుర్తింపు యూనియన్ ఎన్నికలు నేడు




భెల్ పరిపాలనా భవనం

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ ఎన్నికలు గురువారం నిర్వహించనున్నారు. సంస్థ వెల్ఫేర్ బిల్డింగ్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న పోలింగ్‌లో 446 మంది కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల్లో మూడు యూనియన్లు పోటీలో నిలిచాయి.

- బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్ (సీరియల్ నం.2): ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్యానెల్‌లో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, వైఎస్సార్ టీయూసీ, ఏఐసీటీయూ, ప్రగతిశీలశక్తుల యూనియన్లు ఉన్నాయి. సీఐటీయూ నుంచి అధ్యక్షుడిగా జి.టి.పి.ప్రకాష్, ఐఎన్‌టీయూసీ నుంచి ప్రధాన కార్యదర్శిగా ఉరుకూటి బాబూరావు పోటీ చేస్తున్నారు.
- యునైటెడ్ ఫ్రంట్ (సీరియల్ నం.3): యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) ప్యానెల్‌లో ఏఐటీయూసీ, బీహెచ్‌పీవీ ఎంఎస్, టీఎన్‌టీయూసీ, వైఎస్సార్ టీయూ, డీఈయూ, బీఈఆర్‌పీటీయూ, యూత్ ఎంప్లాయిస్ యూనియన్లు ఉన్నాయి. బీహెచ్‌పీవీ ఎంఎస్ నుంచి బొండా బాబూరావు అధ్యక్షుడిగా, టీఎన్‌టీయూసీ నుంచి సుభాకర్ సాహు ప్రధాన కార్యదర్శిగా బరిలో ఉన్నారు.
- బీఎంఎస్ యూనియన్ (సీరియల్ నం.1): ఎన్నికల్లో మరో యూనియన్‌గా బీఎంఎస్ బరిలో నిలిచింది.

పోలింగ్ ముగిసిన అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఫలితాలను ఎన్నికల అధికారి డి.శ్రీనివాసులు వెల్లడించనున్నారు.

## ఆకట్టుకున్న కథా కచేరి

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కథా కచేరి వైవిధ్యమైన అంశాంతో అందరినీ అలరించింది. సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథలతో మానసిక వికాసం కలుగుతుందన్నారు. రచయితలు తమ కథల ద్వారా మానవాళికి మమత, మానవత్వపు పరిమళం, మానవీయ విలువలు సమాజానికి చాటి చెప్పాలన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ రచయితకు తను చెప్పే విషయంపై నిర్దిష్ట అభిప్రాయం ఉండాలన్నారు. కథలను సమీక్షించారు. రచయిత మేడా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ కథకులకు కథలు వినిపించడానికి అవకాశం కల్పించినందుకు సహృదయ సాహితికి ధన్యవాదాలు తెలిపారు. కథా కచేరి ద్వారా ఎందరో రచయితలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.

## నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ భారతి

అగనంపూడి: ఒకరు చేసే నేత్ర దానం ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపుతుందని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి అన్నారు. 38వ జాతీయ అంధత్వ నివారణ పక్షోత్సవాల సందర్భంగా అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో జిల్లా అంధత్వ శాఖ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మరణం తరువాత కూడా ప్రకృతిని వీక్షించే అవకాశం నేత్ర దానం వల్ల కలుగుతుందన్నారు. ఇద్దరి జీవితాల్లో వెలుగునివడంతో పాటు మరణం తరువాత కూడా బతికుండే అవకాశం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నేత్రదానం ఆవశ్యకతపై పోస్టర్లు విడుదల చేశారు. ఆర్ఎంవో డాక్టర్ ఉష, గోపీకృష్ణ, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ ఆశాశ్రీ,, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, యంగ్ ఇండియా అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ తృప్తి, ఆప్తమాలిక్ అధికారులు కె.ఎస్.సరళ, ధనలక్ష్మి, రాజశేఖర్, రమణి తదితరులు పాల్గొన్నారు.

### అప్పన్నకు విశేషంగా తిరువీధి

సింహాచలం: మాస జయంతిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం తిరువీధి ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకిలో అధిష్టంపజేసి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని తరించారు.

## కమిషనర్ దృష్టికి దీర్ఘకాలిక సమస్యలు



జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గం పరిధిలో సుదీర్ఘ కాలంగా పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలను వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ బుధవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలతో పాటు పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యక్రమాలతో కూడిన వినతి పత్రం అందించారు. రహదారులు, కాల్వలు, ప్రధాన గెడ్డలు, మరమ్మతులకు నోచుకోక దారుణంగా తయారయ్యాయని ఆనంద్‌కుమార్ వివరించారు. వీటి వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సంస్థలతో ముడిపడి ఉన్న ప్రధాన సమస్యలు పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని ఆనంద్‌కుమార్ తెలిపారు.

## పోలీస్ స్టేషన్‌లో ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డీసీపీ ఆనంథ్‌రెడ్డి, హెచ్‌పీసీఎల్ ఈడీ రతన్‌రాజ్

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థ సీఎస్ఆర్ నిధులతో మల్కాపురం పోలీస్‌స్టేషన్‌లో ఆర్‌వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను బుధవారం డీసీపీ ఆనంథ్‌రెడ్డి, హార్బర్ ఏసీపీ మోసెస్‌పాల్, హెచ్‌పీసీఎల్ ఈడీ రతన్‌రాజ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డీసీపీ ఆనంథ్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ ప్లాంట్ సిబ్బందితో పాటు స్టేషన్‌కు వచ్చే కక్షిదారులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మల్కాపురం సీఐ జి.డి. బాబు, ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శన్‌రావు,హెచ్‌పీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

## 'లక్ష్యాన్ని చేరే వరకు చదువుపైనే దృష్టి'



బయాలజీ, ఫిజిక్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కోరమాండల్ ప్రెసిడెంట్ అరుణ్

మల్కాపురం: ఎంచుకున్న లక్ష్యాన్ని చేరే వరకు ప్రతి విద్యార్థి చదువుపైనే దృష్టి పెట్టాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రెసిడెంట్ అరుణ్ సూచించారు. కోరమాండల్ సంస్థ సహకారంతో 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ పాఠశాలకు సుమారు రూ.8 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన బయాలజీ, ఫిజిక్స్ ల్యాబ్‌ను ఆయన వార్డు కార్పొరేటర్ కొణతాల సుధతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అరుణ్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నత విద్యకు తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. ఉపాధ్యాయులు చక్కటి బోధనలతో విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. కార్పొరేటర్ కొణతాల సుధ మాట్లాడుతూ పాఠశాలలో అధునాతన సౌకర్యాలతో ల్యాబ్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్)ఆర్.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయిని అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాఖీ పండగ



బెహరాకు చిత్రపటం అందిస్తున్న బ్రహ్మకుమారీస్



ఆడారికి రాఖీ కడుతున్న మహిళలు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో బుధవారం రాఖీ పండగను ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 89వ వార్డు మహిళా కార్యకర్తలు, నాయకలు పశ్చిమసమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్‌కు రాఖీలు కట్టారు. ఆనంద్ కుమార్ పశ్చిమ నియోజకవర్గానికి ఎమ్మెల్యే కావాలని వారంతా ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుకు విరాట్‌నగర్‌కు చెందిన బ్రహ్మకుమారీస్ సోదరీమణులు ఆయన ఇంటి వద్ద రాఖీ కట్టారు. చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు జ్యోతి, లక్ష్మి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

### పబ్లిక్ డిమాండ్

## పూడికలు తొలగించండి



గొల్లకంచరపాలెం గెడ్డ దుస్థితి ఇలా...

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం నుంచి తోటవీధి ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌కు ఆనుకుని ఉన్న గెడ్డల్లో పూడికలు తొలగించండి. పూడికలు సక్రమంగా తీయకపోవడంతో పరిసర ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. వర్షాలు పడేటప్పుడు చెత్తాచెదారాలు గెడ్డల్లో అడ్డంగా నిలవడంతో పందులు చేరుతున్నాయి. పూడికలు తొలగించాలని ఫిర్యాదులు చేసినా పారిశుధ్య అధికారులు పట్టించు కోవడం లేదు. ఇప్పటికైనా పబ్లిక్‌హెల్త్ అధికారులు స్పందించి పూడికలు తొలగించాలి.

–పల్లా వెంకటరావు, గొల్లకంచరపాలెం